

వాగెక్కని వంతెన

భారీ వరదల సమయంలో రాకపోకలకు అంతరాయం



నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిర్సవాడ వద్ద రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ నది

- ఉమ్మడి జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాల ప్రజలకు ఏళ్లుగా తప్పని ఇబ్బందులు
- వానొస్తే ఇతర ప్రాంతాలతో కమ్యూనికేషన్ కట్
- చాలా చోట్ల బ్రిడ్జిల నిర్మాణానికి శంకుస్థాపన
- ఆరంభ శూరత్వమే.. తర్వాత పట్టింపు లేదు
- ఊకచెట్టు వాగు, దుందుభీ నది.. ఇతర వాగుల వద్ద అదే దుస్థితి
- ప్రాణాలు కోల్పోతున్నా బ్రిడ్జీల నిర్మాణంలో అలసత్వం

మహబూబ్‌నగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గడిచిన కొద్దిరోజులుగా ఉమ్మడి జిల్లాలో భారీగా వర్షాలు నమోదవుతున్నాయి. ప్రధాన ప్రాజెక్టులతో పాటు.. అన్ని చెరువులు, కుంటలు నిండు కుండల్లా మారాయి. చెరువులు అలుగులు పారుతుండగా.. వాగులు ఉప్పొంగుతున్నాయి. నదులు ఎగువ నుంచి వచ్చే వరదను దిగువకు మోసుకెళ్తున్నాయి. వర్షం బాగా కురవాలని ఆశగా ఎదురుచూసే వారే ఇప్పుడు వరదలు ఎప్పుడు తక్కువవుతాయా? అని ఎదురుచూడాల్సిన పరిస్థితులు తలెత్తాయి. కారణం.. వాగులు పొంగడం, వరదలు రావడం వల్ల ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన గ్రామాలకు, మండలాలకు, పట్టణాలకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఒకవేళ తప్పనిసరై వెళ్లాలన్నా ఎక్కువ కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు సెప్టెంబరు చివరి వరకు కొనసాగుతాయి. అప్పటివరకు ఈ అవస్థలు పడాల్సిందే. వాగులు, నదులు, వంకలపై ఉన్న రోడ్లకు వంతెనలు నిర్మించకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ఏళ్లుగా రోడ్లు వేస్తున్న ప్రభుత్వాలు ఓ మోస్తారు వంతెనలను నిర్మించకుండా, లో లెవల్ కాజ్‌వేలు, కల్వర్టులు నిర్మించడం వల్ల వరదలు బాగా వచ్చినప్పుడు వాటిపై నుంచి నీరు పారుతోంది. చిన్న చిన్న వాగులను వదిలేస్తే పెద్ద వాగులు, నదులపైనా ఈ బ్రిడ్జీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. వరదలప్పుడు ఈ నీటిలో పడి ఏటా కొందరు గల్లంతవుతూనే ఉన్నారు. అప్పుడు ప్రతిపాదనలు పెట్టి.. శంకుస్థాపనలు చేసినా అది ఆరంభశూరత్వమే అవుతోంది తప్ప అడుగు ముందుకు పడటం లేదు. బిల్లులు ఇవ్వక కాంట్రాక్టర్ పారిపోవడమో.. నిధులు సరిపోక నిర్లక్ష్యంగా పనులు చేయడమో.. అంచనాలు పెరిగిపోవడమో వంటి కారణాలతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో అనేక వంతెనలు అలాగే మిగిలిపోతున్నాయి. పాలకుల కటాక్షం కోసం ఎదురుచూస్తున్నాయి.

సిర్సవాడ వంతెన టెండర్ ఎప్పుడో..

తాడూరు మండలంలోని సిర్సవాడ వద్ద దుందుభీ నది భారీగా ప్రవాహ వేగం కలిగి ఉంటుంది. ఇక్కడ ఉన్న లో లెవల్ కాజ్‌వే పై నుంచి నీరు పారుతుంది. దీంతో కల్వకుర్తి, ఉర్కొండ, మిడ్జిల్ మండలాలకు రాకపోకలు నిలిచిపోతాయి. గత మార్చిలో సిర్సవాడ వద్ద నదిపై హై లెవల్ వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం రూ.20.20 కోట్లను మంజూరు చేసింది. కానీ ఇప్పటివరకు టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు. దాదాపు 5 నెలలైనా అడుగు ముందుకు పడలేదు. ఈ వంతెన వద్ద గతంలో రాములు, పర్వతాలు అనే వ్యక్తులు గల్లంతయ్యారు. అలాగే ఇదే మండలం నాగర్‌కర్నూల్, జడ్చర్ల ప్రధాన రహదారిపై ఐతోల్-సిర్సవాడ మధ్య ఉన్న లో లెవల్ కాజ్ వే, నాగదేవపల్లి- అకునెల్లి కుదురు గ్రా మాల మధ్య ఉన్న కాజ్ వేపై వర్షాలప్పుడు ప్రవాహం ఎక్కువ కావడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి.

బిల్లులు ఇవ్వలేదని ఆగిన శేరుపల్లి వంతెన పనులు

కొల్లాపూర్ నుంచి పెబ్బేరు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో రెండు హై లెవల్ బ్రిడ్జిలు

మిగతా 6లో..

ఎనిమిదేళ్లుగా... 'ఊకె' చెట్టు బ్రిడ్జి

వనపర్తి నుంచి ఆత్మకూరు, అమరచింత మండలాలకు వెళ్లాలంటే మదనాపూర్ మండలంలోని ఊకచెట్టు వాగును దాటి వెళ్లాల్సిందే. ఇది వరదలు వచ్చినప్పుడు ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. సరళాసాగర్ సైఫన్లు తెరుచుకుంటే ఇక అంతే సంగతి. దీనిపై హై లెవల్ వంతెన నిర్మించాలని దశాబ్దాలుగా ప్రతిపాదనలు ఉన్నాయి. 2017లో రూ. 9.25కోట్లతో శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పని చేయకుండానే వెళ్లిపోవడంతో 2021లో రీ టెండర్ వేశారు. 2022 చివరిలో పనులు మొదలుపెట్టగా.. మొత్తం 19 పిల్లర్ల నిర్మాణం పూర్తయ్యింది. బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు కోసం రూ. 5 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. కానీ అవి మంజూరు కాకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. ఏటా ఈ రెండు మండలాలకు జిల్లా కేంద్రంతో రాకపోకలు తెగిపోతున్నాయి. 2022లో వరదలకు ఇక్కడ దాదాపు నలుగురు గల్లంతై చనిపోయారు.



ఊకచెట్టు వాగుపై అసంపూర్తిగా మిగిలిపోయిన బ్రిడ్జి

ఆందోళన వద్దు

రైతులకు అవసరమైనంత యూరియా ఉంది

ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ బదావత్ సంతోష్



జిల్లా కేంద్రంలోని గోదాములో యూరియా బస్తాలను పరిశీలిస్తున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం ఆయన నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రాన్ని తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌ను చెక్ చేశారు. ఇంత వరకు ఎన్ని బస్తాల యూరియా విక్రయించారో రిజిస్టర్‌లో తప్పనిసరిగా రాయాలని దుకాణ యాజమానికి సూచించారు. గోదాంలో నిల్వ ఉన్న ఎరువుల బస్తాలను పరిశీలించారు. పాస్ బుక్‌లను చూసి రైతులకు యూరియా ఇవ్వాలన్నారు. రైతులు కూడా పంటలకు మోతాదుకు మించి ఎరువులు వాడొద్దని, అధికంగా వాడటం వలన నేల సాంద్రత దెబ్బతింటుందని కలెక్టర్ సూచించారు. యూరియా పక్కదారి పట్టకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు, డివిజన్ వ్యవసాయ అధికారి పూర్ణచందర్‌రెడ్డి, ఇతర వ్యవసాయ అధికారులు ఉన్నారు.

బ్రిడ్జీల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



బున్యాధిపురం-జానంపేట గ్రామాల మధ్యన అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

పెబ్బేరు రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు చేపట్టిన బ్రిడ్జీల నిర్మాణం తక్షణమే పూర్తిచేయాలని ప్రణాళికా సంఘం ఉపాధ్యాక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి అధికారులకు సూచించారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని బున్యాధిపురం-జానంపేట గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణ పనులు రూ2 కోట్లతో చేపట్టి మధ్యలోనే వదిలేశారు. ఈ బ్రిడ్జి అసంపూర్తిగా ఉండటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్రిడ్జి పనులు అసంపూర్తిగా ఉండటానికి గల కారణాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి త్వరలోనే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి యాదయ్య, జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.



ఆత్మకూరు పీఏసీఎస్ వద్ద క్యూలో నిల్చున్న రైతులు


యూరియా దొరుకుతలేదయా!

- సహకార సంఘాల వద్ద రైతుల బారులు - గంటల తరబడి ఎదురుచూపులు

7

'సుంకేసుల'కు కొనసాగుతున్న వరద

- 1.45 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



6

సుంకేసుల డ్యాం నుంచి విడుదల అవుతున్న నీరు

సర్పగండం

- జోగులాంబ గద్వాల జిల్లాలో పెరుగుతున్న పాము కాట్లు
- గత నెలలో 16, ఈ నెలలో ఇప్పటివరకు 12 కేసులు
- ఆందోళన చెందుతున్న జిల్లా ప్రజలు

6

వేంకల్ మినీ ఎత్తిపోతల పరిశీలన

- ఇరిగేషన్ సీఈ విజయభాస్కర్‌రెడ్డి
- నూతన లిఫ్ట్ కోసం ప్రతిపాదనలు పెడతాం



మల్లేశ్వరం వద్ద కృష్ణానది మరబోటులో మినీ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

సకాలంలో ఎరువులు అందించాలి

- గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం గద్వాల కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యవసాయశాఖ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రస్తుతం జిల్లాలో నిలువ ఉన్న 543 మెట్రిక్ టన్నుల యూరియాను అవసరం ఉన్న రైతులకు పంపిణీ చేయాలని, యూరియా పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్తగా జిల్లాకు వచ్చే యూరియా నిల్వలను పీఏసీఎస్‌ల ద్వారానే రైతులకు అందజేయాలని సూచించారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది 600 మెట్రిక్ టన్నుల యూరియాను అధికంగా విక్రయిచినా కొరత ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఎరువులు పక్కదారి పట్టకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్, ఏడీఏ సంగీతలక్ష్మి, మండల వ్యవసాయ అధికారులు ఉన్నారు.

సన్నాలకు.. బోనస్ ఏదీ..?

- వానాకాలం పంటలకు పెట్టుబడి కోసం కష్టాలు
- రూ.500 బోనస్ కోసం ఎదురు చూస్తున్న రైతులు



అయిజ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

అయిజ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చింది. గతేడాది వానాకాలంలో సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.500 బోనస్ అందించారు. యాసంగిలో కూడా సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. కానీ నేటికీ బోనస్ అందలేదు. బోనస్ డబ్బులు వస్తే వానాకాలం సాగు పెట్టుబడికి తోడవుతా యనుకున్న రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో జూరాల, రిజర్వాయర్‌లు, బావులు, బోర్లు, చెరువులు, కుంటలు, ఆర్డీఎస్ ఆయకట్టులో అధికంగా వరి సాగు చేస్తారు. ప్రభుత్వ బోనస్ ప్రకటించిన కారణంగా రైతులు అధికంగా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. గతేడాది వానాకాలం బోనస్ డబ్బులు సక్రమంగానే రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేశారు. యాసంగిలోను బోనస్ డబ్బులు వెంటనే వేస్తారని బావించిన రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించారు. కానీ బోనస్ నేటికీ అందలేదు. ప్రస్తుతం జూరాల, రిజార్వాయర్, కృష్ణ, తుంగభద్రా, ఆర్డీఎస్ పరిధి, చెరువులు, కుంటల పరిధిలో జోరుగా వరి నాట్లు వేస్తున్నారు. పెట్టుబడి కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. అదే బోనస్ అందితే వడ్డీ వ్యాపారులనను ఆశ్రయించాల్సిన అవసరం వచ్చేది కాదని అన్నదాతలు వాపోతున్నారు.

రైతులకు అందాల్సిన బోనస్

జిల్లా వ్యాప్తంగా గత యాసంగిలో ఐకేపీ, సింగిల్‌విండో అధ్వర్యంలో 72 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపుగా 10 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. బోనస్ కింద 15,136 మంది రైతులకు సంబంధించి దాదాపు రూ.50 కోట్లు రైతులకు అందాల్సి ఉంది.

పెట్టుబడికి ఇబ్బందిగా ఉంది..



ఆర్డీఎస్ పరిధిలో సన్నాలు సాగుచేస్తాం. గత వానాకాలంలో సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో అమ్మితే మద్దతు ధరతో పాటు బోనస్ రూ.500 కూడా చెల్లించారు. యాసంగిలో 360 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్ర యించాను. బోనస్ కింద రూ.1.80లక్షలు రావాల్సి ఉంది. పెట్టుబడికోసం చాలా ఇబ్బంది పడుతున్నాం.

- వాతం ఆంజనేయులు, పులికల్

త్వరలోనే బోనస్ డబ్బులు



రైతులకు చెల్లించాల్సిన బోనస్ డబ్బులు త్వరలో అందే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా రైతులకు రావాల్సిన బోనస్ డబ్బుల వివరాలు ప్రభుత్వానికి అందించాం. త్వరలో రైతుల బ్యాంకుల ఖాతాలో జమ అవుతాయి.

- అవుల స్వామికుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

పరవళ్లు తొక్కుతున్న డిండి

- పెరుగుతున్న పర్యాటకులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ఉప్పునుంతల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని డిండి ప్రాజెక్టు పది రోజులుగా అలుగు పారుతోంది. ప్రాజెక్టు అందాలు చూసేందుకు రోజురోజుకు పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. డిండి ప్రాజెక్టు సమీపంలో శ్రీశైలం-హైదరాబాద్ రహదారి ఉంది. ఈ రహదారిపై నిలబడి పర్యాటకులు డిండి ప్రాజెక్టు అందాలను ఫోన్‌లలో చిత్రీకరించుకోవడం, సెల్ఫీలు తీసుకుంటుండటంతో పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి డిండి ప్రాజెక్టు వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



డిండి అలుగు వద్ద శ్రీశైలం - హైదరాబాద్ రోడ్డుపైనే వాహనాలను నిలిపి ప్రాజెక్టు అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

సమష్టి కృషితోనే చేనేత క్లస్టర్ అభివృద్ధి

- నాబార్డ్ డీడీఎం మనోహర్‌రెడ్డి



అమరచింతలో హ్యాండ్లూమ్ కంపెనీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాబార్డ్ డీడీఎం మనోహర్ రెడ్డి

అమరచింత, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కార్మికులు సమష్టి కృషితో అమరచింత చేనేత హ్యాండ్లూమ్ క్లస్టర్‌ను అభివృద్ధి చేసుకోవాలని నాబర్డ్ డీడీఎం మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం అమరచింతలో సిల్క్ హ్యాండ్లూమ్ వివర్స్ ప్రొడక్ట్ కంపెనీ కార్యాలయాన్ని ఆయా జిల్లాల లీడ్‌బ్యాంక్ మేనేజర్‌లు, ఎస్‌బీఐ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలోని అమరచింత హ్యాండ్లూమ్ కంపెనీ విజయవంతంగా కొనసాగుతోందని ఆయన అన్నారు. కంపెనీ నిర్వాహకులు, కార్మికుల సమిష్టి కృషితోనే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. పట్టణంలో కంపెనీ కార్యాలయంతో పాటు రూరల్ మార్టను ప్రారంభించుకోవడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. కంపెనీ అభివృద్ధికి నాబార్డ్ అన్ని విధాల సహకరిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్లూమ్ కంపెనీ సీఈవో మహంకాళి చంద్రశేఖర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, కంపెనీ డైరెక్టర్ పోబ్బతి వెంకటస్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వేంకల్ మినీ ఎత్తిపోతల పరిశీలన

- ఇరిగేషన్ సీఈ విజయభాస్కర్‌రెడ్డి
- నూతన లిఫ్ట్ కోసం ప్రతిపాదనలు పెడతాం

పెంట్లవెల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 8న పిడుగుపాటుకు గురై పెంట్లవెల్లి మండలం వేంకల్ మినీ ఎత్తిపోతల పథకాన్ని ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఇరిగేషన్ సీఈ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో వేంకల్, మల్లేశ్వరం, గ్రామాల సమీపంలో కృష్ణానది తీరం ఒడ్డున 20 సంవత్సరాల క్రితం నిర్మించిన వేంకల్ ఎత్తిపోతల పథకం పనులు మధ్యలోనే ఆగిపోయాయని తెలిపారు. కృష్ణానదిలో మరబోటు ద్వారా వెళ్లి, ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించామని పేర్కొన్నారు. ఈ వంతెన మరమ్మతులు చేపట్టినా ఉపయోగం లేదని, నూతన లిఫ్టు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ జయరాం, స్థానిక బీజేపీ నాయకుడు అశోక్‌నంద పాల్గొన్నారు.

భూమికి భూమి ఇప్పించండి

- భూములు కోల్పోతే నష్టపోతాం
- ఇర్విన్ రిజర్వాయర్ భూసేకరణపై అజిలాపూర్‌లో గ్రామసభ
- ఆర్డీవో జనార్దన్‌రెడ్డి ఎదుట రైతుల మనోవేదన



గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

వెల్దండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : తాము భూములు కోల్పోతే తీవ్రంగా నష్టపోతామని అజిలాపూర్ గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అజిలాపూర్ గ్రామశివారులో ఏర్పాటు చేయబోయే ఇర్విన్ రిజర్వాయర్ కోసం భూసేకరణలో భాగంగా బుధవారం గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణకు గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్‌రెడ్డి, తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌తోపాటు ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు. గ్రామరైతులకు చెందిన సుమారు 186 ఎకరాల భూములకు సంబంధించిన రైతులు హాజరయ్యారు. తమకు భూమికి బదులుగా భూమి ఇప్పించాలని, నష్టపరిహారాన్ని పెంచాలని, రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించాలని రైతులు డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్లతో కూడిన నివేదికలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని అధికారులు తెలిపారు. గ్రామసభ సందర్భంగా సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధికారులు శంకర్‌నాయక్, హనుమ తదితరులు ఉన్నారు.

కురుమూర్తి బ్రహ్మోత్సవాల కోసం టెండర్లు

చిన్నచింతకుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో వాటికి సంబంధించిన వేలం బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. లడ్డు విక్రయించుటకు రూ.46 లక్షలు, తలనీలాలు రూ.32 లక్షలు, టెంకాయ చిప్పలకు రూ.4.62లక్షలు, జాతరలో లైటింగ్ కోసం రూ.13.33లక్షలు, రంగుల రాట్నానికి సంబంధించి రూ.34.5లక్షలు పలికాయి. కాగా టెంకాయల విక్రయాలు, పూజా సామాగ్రికి సంబంధించిన వేలం వాయిదా పడింది. కార్యక్రమంలో కురుమూర్తి ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ కతలప్ప, సురేందర్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, నరేందర్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు భాస్కరాచారి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

9 రోజుల పాటు ఉపవాసంతో విద్యార్థినుల పూజలు



మొలకలను నిమజ్జనం చేసేందుకు ఊరేగింపుగా వెళ్తున్న విద్యార్థినులు

జడ్చర్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని కోడ్గల్ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో బుధవారం విద్యార్థినులు ఘనంగా తీజ్ ఉత్సవాలను నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొలకలను సిద్ధం చేసుకున్నారు. తొమ్మిదిరోజుల పాటు ఉపవాసంతో ఉండి చివరి రోజు గోధుమ గింజలను వెదురు బుట్టలో వేసి ప్రతీ రోజు పూజలు చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థినులు సాంప్రదాయ వేషధారణలో తీజ్ పాటలు పాడుతూ, నృత్యాలు చేశారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి దుందుభీ నదిలో నిమజ్జనం చేశారు. ప్రిన్సిపాల్ రజ నిరాగలత, ఉపాధ్యాయులు అనిత, స్వాతి, పార్వతి, శ్రీప్రియ, రాజ శ్రీ, అవంతి, సరితలతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం: కేసు నమోదు

జడ్చర్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీకి చెందిన సంపంగి మల్లేష్ కనిపించడంలేదంటూ తండ్రి సంపంగి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న మల్లేష్ ఈ నెల 18న పాఠశాలకు వెళ్తున్నట్లుగా చెప్పి, ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడని చెప్పారు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మిడ్జిల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు భార్య అంజనమ్మ(55) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్ ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. ఈమె కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకపోవడంతో చికిత్స చేయించినట్లు తెలిపారు. ఈనెల 14న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను 17న హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మహమ్మదాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమంగా తరలిస్తు యాజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మధిర మీది తండా, గువ్వోని కుంట తండా సమీపంలో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి వెల్లారు. దీంతో అక్కడే ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్‌ను వదిలేసి పారిపోయారని తెలిపారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సర్పగండం



పిల్లిగుండ్ల కాలనీలో ఇళ్ల మధ్య ఉన్న బావి పూర్తిగా నిండి పైకి వచ్చిన నీరు

- జోగుళాంబ గద్వాల జిల్లాలో పెరుగుతున్న పాము కాట్లు
- గత నెలలో 16, ఈ నెలలో ఇప్పటివరకు 12 కేసులు
- ఆందోళన చెందుతున్న జిల్లా ప్రజలు

గద్వాల క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో పాములు భయపెడుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం నుంచి పాము కాట్లు పెరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణాలు, గ్రామాల్లో ఇళ్ల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి పాములకు ఆవాసంగా మారినట్లు చెప్తున్నారు. అవి తరుచూ ఇళ్లలోకి కూడా వస్తున్నాయంటున్నారు. జిల్లా కేంద్రంలోని పిల్లిగుండకాలనీలోని ఇండ్ల మధ్యన పాత బావి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు బావి పూర్తిగా నీటితో నిండిపోవడంతో పాములు ఇళ్లలోకి వస్తున్నాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆ బావిని పూడ్పించాలని, ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని పలుమార్లు మునిసిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

భయపెడుతున్న పాములు

వర్షాకాలంలో పాముల బెడద ఎక్కువయ్యింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గత నెలలో 16 పాము కాటు కేసులు నమోదయ్యాయి. ఈ నెలలో ఇప్పటి వరకు 12 మంది పాముకాటుకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. వారందరికీ స్వస్థత చేకూరినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. వీరితో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ పాము కాటు కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పాము కాటుకు గురైన వారిలో ఎక్కువ మంది నాటు వైద్యం చేయించుకుంటున్నట్లు సమాచారం. పాము కాటుతో చనిపోయినా, కుటుంబ సభ్యులు బయటకు చెప్పడం లేదని తెలుస్తోంది.

ఇళ్లలోకి పాములు వస్తున్నాయి



కాలనీ పక్కనే ఉన్న బావి వర్షం నీటితో నిండిపోయింది. దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగి, పాములకు ఆవాసాలుగా మారాయి. దీంతో కాలనీలోని ఇళ్లలోకి పాములు వస్తున్నాయి. దీంతో కంటి మీద కునుకు ఉండటం లేదు. అలాగే రాత్రి వేళ బయటకు వెళ్లాలంటే భయం అవుతోంది. మునిసిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

\- సునీత, పిల్లిగుండ్ల కాలనీ, గద్వాల

అధికారులు పట్టించుకోవడం లేదు



కాలనీలోని ఖాళీ ప్లాట్లలో పిచ్చి మొక్కలు పెరిగి పాముల బెడద ఎక్కువయ్యింది. దీంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నాం. ఈ విషయాన్ని మునిసిపల్ అధికారులు, సిబ్బందికి పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

\- భాగమ్మ, పిల్లిగుండ్ల కాలనీ, గద్వాల

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలంలో పాముల సంచారం ఎక్కువవుతుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇళ్ల చుట్టూ పిచ్చి మొక్కలు పెరగకుండా జాగ్రత్త వహించాలి. చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించుకొని శుభ్రం చేసుకోవాలి. పాము కాటేస్తే నాటు వైద్యులను ఆశ్రయించొద్దు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందాలి.

\- డాక్టర్ ఇందిర, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి

కానిస్టేబుల్ నిజాయతీ

- బాధితుడికి బంగారు గొలుసు అప్పగింత



కానిస్టేబుల్ హర్ష

ఊర్కొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఓ పోలీసు కానిస్టేబుల్ నిజాయితీని చాటుకొని గ్రామస్థుల ప్రశంసలను అందుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని రాంరెడ్డిపల్లిలో మంగళవారం రాత్రి బోనాల ఉత్సవం నిర్వహించారు. బోనాల ఊరేగింపులో అదే గ్రామానికి చెందిన చిన్న కుర్వ శివ తన మెడలోని 2 తులాల బంగారు గొలుసును పోగొట్టుకున్నాడు. విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ హర్షకు ఆ గొలుసు దొరకడంతో దాన్ని ఏఎస్ఐ లచ్చి నాయక్ ఇచ్చాడు. బాధితుడు, అతడి సోదరుడు అనిల్‌తో కలిసి బంగారు గొలుసుకోసం వెతుకుతుండగా, పోలీసులు గమనించారు. వారితో మాట్లాడి నిర్ధారించుకున్న తర్వాత గ్రామస్థుల సమక్షంలో గొలుసును అప్పగించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, తోటి ఉద్యోగులు హర్షను అభినందించారు.



బాధితుడు పోగొట్టుకున్న బంగారు గొలుసు

మహబూబ్‌నగర్-గుంతకల్ రైలు మార్గంలో జీఎం శ్రీవాత్సవ తనిఖీ

హైదరాబాద్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):- మహబూబ్‌నగర్-గుంతకల్ మార్గంలో రైలు ట్రాక్, సిగ్నల్స్ పనితీరుతో పాటు రైలు వంతెనల భద్రత ప్రమాణాలను దక్షిణ మధ్య రైల్వే జనరల్‌మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవవిస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. భద్రతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం హైదరాబాద్ డివిజనల్‌మేనేజర్ సంతోష్ కుమార్ వర్మాతో కలిసి శ్రీవాస్తవసికింద్రాబాద్ స్టేషన్ నుంచి రైలులో బయలుదేరి ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అనంతరం కడప నుంచి గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్‌చంద్రశేఖర్ గుప్తా తో కలిసి రైలు వంతెనల తీరును సమీక్షించారు. అనంతరంతిరుపతి రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్‌స్టేషన్ పథకం కింద జరుగుతున్న పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం కడప రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పునర్నిర్మాణ పనులను పరిశీలించి అక్కడి నిర్మాణ పనులు, భద్రతా చర్యలను సమీక్షించారు. ఈసందర్భంగా గుంతకల్ డివిజనల్ ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమావేశమై వివిధ మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టిన ప్రాజెక్టుల పనుల ప్రగతి,స్టేషన్ పునర్నిర్మాణ పనుల తీరును తెలుసుకున్నారు.

చెంచులకు ఓపెన్ డిగ్రీ ప్రోత్సాహం

బల్మూరు, ఆగస్టు 20 (ఆంధ్యజ్యోతి) : విద్యకు నోచుకోకుండా గ్రామీణ ప్రాంతాల్లో అడవుల్లో నివసిస్తున్న గిరిజనులైన ఆదివాసి చెంచులకు తక్కువ ఫీజుతో ఓపెన్ యూనివర్సిటీలో విద్యనందించేందుకు అంబేద్కర్ యూనివర్సిటీ ప్రోత్సహిస్తుందని కొండనాగుల కళాశాల ప్రిన్సిపాల్ ఫిరంగి రవి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కొండనాగుల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనులైన ఆదివాసి చెంచులు, గోండులు, వెనకబడిన జాతులకు ఓపెన్ యూనివర్సిటీలో కేవలం రూ.500కే విద్యనందిస్తుందని తెలిపారు. ఈ ప్రాంత విద్యార్థులు బిల్లకల్ చెం చుగూడెం వెళ్లి చెంచు విద్యార్థులతో అవగాహనను కల్పించడానికి డాక్టర్ బీఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ హైద్రాబాద్ నుండి డాక్టర్ వై.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ అదేవిధంగా ప్రొఫెసర్ రవీంద్రనాథ్, సల్మాన్ డైరెక్టర్ ఆఫ్‌తోపాటు డాక్టర్ బీఆ ర్.అంబేద్కర్ యూనివర్సిటీ స్టడీ 143సెంటర్ కొండనాగుల కౌన్సిలర్లు పాల్గొన్నారు. అడ్మిషన్ గడువు ఆగస్టు 30వరకు ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మల్దకల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులను భరించలేక ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్‌లో జరిగింది. మండల కేంద్రానికి చెందిన నరసింహులు ఇటీవల ఆర్థిక ఇబ్బందులకు గురికావడంతో కుటుంబంలో కలతలు చెలరేగాయి. దీంతో మనస్తాపానికి గురైన అతడు మంగళవారం రాత్రి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

మద్దూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : షార్టు సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఓ ఇల్లు దగ్గదమైన సంఘటన నారాయణపేట జిల్లా మద్దూర్ మండల పరిధిలోని దోరేపల్లిలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి చాకలి నర్సమ్మ ఇంట్లో అర్ధరాత్రి 12 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి, మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు పక్క ఇంట్లో నిద్రపోతున్న నర్సమ్మకు తెలిపారు. అప్పటికే గుడిసె పూర్తిగా కాలిపోయింది. అందులోని ధాన్యం, ఇతర వస్తువులు బూడిదయ్యాయి.

విద్యుదాఘాతంతో కాడెద్దులు మృతి



మాచుపల్లిలో కాడేద్దులు మృతి చెందడంతో రోదిస్తున్న యాజమాని

కోడేరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండల పరిధిలోని మాచుపల్లి గ్రామంలో విద్యుదాఘాతానికి గురై కాడెద్దులు మృతి చెందాయి. యజమాని తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొగ్గు రాములు బుధవారం ఉదయం తన కాడెద్దులను దొడ్డి వద్ద కట్టేశాడు. పైనున్న 11 కేవీ విద్యుత్ తీగలు గాలికి తెగి ఎద్దుల మీద పడటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే చనిపోయాయి. వాటి విలువ సుమారు రూ. 2 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

'సుంకేసుల'కు కొనసాగుతున్న వరద

గద్వాల, (వడ్డెపల్లి), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల కేంద్ర శివారులోని సుంకేసుల జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. జలాశయానికి బుధవారం 1.45 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండటంతో, డ్యామ్ 22 గేట్ల ద్వారా 1.41 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 292 మీటర్లు కాగా, ప్రస్తుతం 290 మీటర్లకు చే రింది. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 1.20 టీఎంసీలకు గాను, ప్రస్తుతం 0.554 టీ ఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి కర్నూలు కేసీ కెనాల్‌కు 2,500 క్యూ సెక్కులు విడుదల చేస్తున్నట్లు జేఈ మహేందర్ రెడ్డి తెలిపారు.

కోయిల్‌సాగర్ 5 గేట్ల ద్వారా నీటి విడుదల

దేవరకద్ర, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సా గర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. బుధవారం ప్రాజెక్టు 5 గేట్లను తెరి చి 7,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత రెండు రోజులుగా కురు స్తున్న వర్షాలతో అంకిళ్ల, కోయిలకొండ పెద్దవాగుల నుంచి ప్రాజెక్టుకు భారీతా వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 32.5 అడుగులు కాగా, బుధవారం సాయంత్రానికి 32 అడుగులకు చేరింది.

తగ్గని వరద..



రామన్‌పాడు ప్రాజెక్టు నుంచి విడదలవుతున్న నీరు

మదనాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, మదనాపురం మండలంలోని సరళాసాగర్, రామన్‌పాడు ప్రాజెక్టులకు వరద కొనసాగుతుంది. బుధవారం కూడా సరళాసాగర్ ప్రాజెక్టు నాలుగు ఆటోమెటిక్ సైఫన్లు తెరుచుకొని నీరు విడుదల అవుతోంది. రామన్‌పాడు ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా ఆరువేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మండలంలోని ఊకచెట్టు వాగు లోలెవెల్ వంతెనపై నీరు పారుతుండడంతో ఆత్మకూర్, వనపర్తిల మధ్య రాకపోకలు మూడవ రోజు కూడా నిలిచిపోయాయి.

'సంగంబండ' 2 గేట్లు ఎత్తివేత..

మక్తల్‌రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం 2 గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ నుంచి పెద్ద వాగుకు వరద నీటి ఉధృతి కొంత తగ్గింది. 1000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, వచ్చిన నీటిని వచ్చినట్లుగా విడుదల చేస్తున్నట్లు డీఈ సురేశ్ తెలిపారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామరథ్యం 3.313 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.60 టీఎంసీల నీరు ఉందని చెప్పారు.

వాగెక్కని వంతెన

(5వ పేజీ తరువాయి)

నిర్మించాలని 2023 నవంబరులో శంకుస్థాన చేశారు. అందులో షేర్‌పల్లి బ్రిడ్జికి రూ.7.50 కోట్లు మంజూరు కాగా, పనులు 80 శాతం పూర్తయ్యాయి. మొత్తం బిల్లుల్లో రూ.2 కోట్లు మాత్రమే కాంట్రాక్టర్‌కు చెల్లించారు. మిగతా డబ్బులు చెల్లించకపోవడంతో పనులు ఆగిపోయాయి. వెంకటాపూర్ బ్రిడ్జికి సంబంధించి రూ.4 కోట్లు మంజూరు చేయగా, పిల్లర్ల వరకు నిర్మించి వదిలేశారు. కాంట్రాక్టర్‌కు రూపాయి కూడా బిల్లు రాకపోవడంతో పనులు చేయలేదని చెబుతున్నారు. బిల్లులు చెల్లిస్తే రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని అంటున్నారు.

ఈ దారిలో నీళ్లు ఎక్కువైతే రెండు బ్రిడ్జిల వద్ద రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది. పక్కన వేసిన తాత్కాలిక రోడ్డు కూడా వర్షాలకు దెబ్బతిన్నది. కొల్లాపూర్ నుంచి పెబ్బేరుకు రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నత్తకు నడక నేర్పినట్లు..

- కొత్తపల్లి- భూనీడ్ మధ్య అసంపూర్తిగా ఉన్న వంతెన




భూనీడ్- కొత్తపల్లి మధ్య పూర్తికాని బ్రిడ్జి నిర్మాణం

నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని భూనీడ్- కొత్తపల్లి మధ్య బ్రిడ్జి నిర్మాణం నత్తకు నడక నేర్పినట్లుగా సాగుతోంది. బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు కేటాయించగా, పనులు పూర్తికపోవడంతో వరద వచ్చి నిలిచిపోయాయి. అలాగే మద్దూరు నుంచి నిడ్జింతకు వెళ్లే దారిలో రూ.75 లక్షలతో బ్రిడ్జి నిర్మిస్తున్నారు.. అదీ పూర్తి కాలేదు. అల్లీపూర్- మానాపూర్ మధ్యలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరు కాగా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఊట్కూరు మండలం ఔసలోనిపల్లి- బిజ్వారం, మల్లేపల్లి, పగిడిమర్రి, ఓబ్లాపూర్, వల్లంపల్లి, అమీన్‌పూర్ గ్రామాల మధ్య కూడా బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు.

ఫిల్లర్స్ దశలోనే..

- ఉల్పర- మొల్గర మధ్య ప్రతిపాదిత బ్రిడ్జి ప్రాంతంలో దుందుభీ ప్రవాహం



రోడ్డుపై పారుతున్న వరద నీటిలో నడుచుకుంటూ వస్తున్న వ్యక్తి

కల్వకుర్తి మండల పరిధిలోని రఘుపతిపేట- రామగిరి దుందుభీ నదిపై హై లెవల్ వంతెన నిర్మాణానికి 2023లో రూ. 45 కోట్లు కేటాయించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు శంకుస్థాపన కూడా చేశారు. కానీ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఫిల్లర్ల వరకు నిర్మాణం చేశారు. రెండేళ్లుగా పనులు సాగుతుండటంతో వరదలు వచ్చినప్పుడు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి. అదే విధంగా వంగూరు మండలం ఉల్పర- మొల్గర గ్రామాల మధ్య దుందుభీ నదిపై వంతెన నిర్మాణానికి రూ.35 కోట్లు మంజూరయ్యాయి. 20 మీటర్ల పొడవు, 6 మీటర్ల ఎత్తులో నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం ప్రదేశాన్ని సర్వే చేయడంతోపాటు భూ పరీక్షలు నిర్వహించి, డిజైన్‌ను పంపించారు. డిజైన్ ఇంకా అప్రూవల్ దశలోనే ఉంది. ఇప్పటివరకు ఆమోదం రాలేదు. పనులు ప్రారంభం కాలేదు.

రీ టెండర్ వేసినా అంతే..

- రాజశ్రీ గార్లపాడు వెళ్లే రోడ్డులో ప్రజల ఇబ్బందులు




వరద నీటిలోనే వెళ్తున్న రాజశ్రీగార్లపాడు ప్రజలు

గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని రాజశ్రీ గార్లపాడు బ్రిడ్జి నిర్మాణానికి 2017లో రూ. 2.52 కోట్లు మంజూరయ్యాయి. అప్పట్లో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ డైవర్షన్ రోడ్డు వేసి, కొంత బిల్లు తీసుకుని పని వదిలేసి వెళ్లారు. దాంతో ఆయన్ను బ్లాక్ లిస్టులో పెట్టి, రీ టెండర్‌కు ప్రయత్నిస్తున్నారు. కానీ ఇప్పటివరకు బిల్లులు రావనే ఉద్దేశంతో ఏ కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. మరోసారి రూ.2.39 కోట్లకు మళ్లీ రీ టెండర్ వేయనున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ తెలిపారు. అలాగే ఇదే మండలం షేక్‌పల్లి వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి 2023లో రూ.1.70 కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ పూర్తిగా పని చేసినా ఇప్పటివరకు బిల్లులు రాలేదు. ఇదే వాగుపై మరో బ్రిడ్జి రూ.3.50 కోట్లతో చేపట్టారు. కానీ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు బిల్లు రాలేదని నిలిపేశారు. వరదలు వచ్చినప్పుడు పది గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు.

కొల్లాపూర్‌లో అనేకం..

- కోడేరు మండలం నాగులపల్లి వాగు వంతెన అసంపూర్తి పనులు



నాగులపల్లి వాగుపై మధ్యలోనే ఆగిన వంతెన నిర్మాణం

కొల్లాపూర్ నియోజకవర్గంలోని కోడేరు మండలంలో వర్షాలు వస్తే వాగులు ఉప్పొంగి, రాకపోకలు నిలిచిపోతున్నాయి. బావాయపల్లి వాగుపై వంతెన నిర్మాణం కోసం 2023లో రూ.6 కోట్లు మంజూరయ్యాయి. కానీ పనులు సకాలంలో ప్రారంభం కాకపోవడంతో నిధులు వాపస్ వెళ్లాయి. శిలాఫలకానికి పరిమితం కావడంతో వరదలు వచ్చినప్పుడు పెద్దకొత్తపల్లి, వనపర్తికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప సుపుల వాగుపై రూ.2 కోట్లతో వంతెన నిర్మించాల్సి ఉండగా, రెండుపైపులు వేసి చేతులు దులుపుకున్నారు. ఖానాపూర్ వాగుపై వంతెన నిర్మించాల్సి ఉంది. రూ.3 కోట్లు అవసరం ఉన్నాయి.. నాగులపల్లి వాగుపై రూ.2.10 కోట్లతో బ్రిడ్జి మంజూరైంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు అసంపూర్తిగా మిగిలాయి. పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి- దేదినేనిపల్లి మధ్య పెద్దవాగుతో ఇబ్బంది అవుతోంది. మంత్రి జూప ల్లి రూ.3 కోట్లు మంజూరు చేశారు. కానీ టెండర్ కాకపోవడంతో పనులు చేపట్టలేదు.

వదిలేసి వెళ్లాడు..

- నీళహళ్లి వాగుపై రాకపోకలకు అంతరాయం



పారుతున్న నీళహళ్లి వాగును దాటుతున్న ఆయా గ్రామాల ప్రజలు

ధరూర్ మండలం నీళహళ్లి నుంచి పాతపాలెం వెళ్లాలంటే 5 గ్రామాలకు నీళహళ్లి వాగు దాటి వెళ్లాల్సిందే. ధరూర్, కేటీదొడ్డి మండలాల మధ్య ఇదే వారధి. కానీ వరద వస్తున్న సమయంలో ఈ రెండు మండలాలకు రాకపోకలు ఆగిపోతాయి. అయిదారు గ్రామాలు పూర్తిగా బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. వంతెన నిర్మాణానికి 2023లో రూ.3 కోట్లు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఫిల్లర్లు వేసి, బిల్లులు రావడం లేదని వదిలేసి వెళ్లాడు. రీ టెండర్ వేసి.. మరో కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు. కానీ ఈలోపే వరద వచ్చింది.

క్రైం కార్నర్

డాడీ.. లే డాడీ...

- కన్నీరు మున్నీరుగా విలపించిన వరుడు
- కొడుకు పెళ్లయిన 5 రోజులకే తండ్రి మృతి


కాశంశెట్టి నర్సింహయ్య (ఫైల్)

ఎర్రవల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పెళ్ల యిన 5 రోజులకే ఆ ఇంట విషాద సంఘటన చోటు చేసుకున్నది. వరుడి తండ్రి గుండె పోటుతో మృతి చెందడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి చౌరస్తాలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. ఎర్రవల్లి చౌరస్తాలో కాశంశెట్టి నర్సింహయ్య (50) 25 సంవత్సరాలుగా కిరాణా వ్యాపారం నిర్వహిస్తు న్నాడు. ఈ నెల 14వ తేదీన పెద్ద కుమారుడైన మనోజ్ వి వాహాన్ని ఘనంగా జరిపించారు. పెళ్లి పందిరి విప్పిన మరుసటి రోజు బుధవారం తెల్లవారు జామున నర్సింహయ్య గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. లే డాడీ.. లే అంటూ వరుడు మనోజ్ కుమార్ రోదించడం అందరి మనసులను కలిచివేసింది. నర్సింహయ్య నిజాయితీపరుడని, కుమారుడి పెళ్లికి అయిన ఖర్చులను లెక్క చూసి, మంగళవారమే అందరికీ చెల్లించాడని స్థానికులు గుర్తు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

భూత్పూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మంగళవారం రాత్రి 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలు ఇలా.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని గుమ్మకొండ గ్రామానికి చెందిన భాస్కర్ భూత్పూర్ మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన వెంకటేశ్వరితో ఐదేళ్ల క్రితం వివాహమైంది. భాస్కర్ కిరాణం దుకాణం నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. పది రోజుల క్రితం భార్య వెంకటేశ్వరి తాటికొండకు వచ్చింది. భార్య దగ్గరకు వెళ్లేందుకు భాస్కర్ (27) తన బైక్‌పై వస్తుండగా మండలంలోని పోతులమడుగు శివారులో 97హోటల్ సమీపంలో అదుపు తప్పి కిందకు పడ్డాడు. తలకు, కాళ్లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చంద్రశేఖర్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

మిడ్జిల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని వల్లభురావుపల్లి గ్రామానికి చెందిన జహంగీర్ కుమార్తె అజ్మాబేగం(35) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. ఆమెకు చిన్నప్పటి నుంచే మతి స్థిమితం లేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెకు పలుమార్లు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరి పనులు వారు చేసుకుంటూ ఉండగా, అజ్మాబేగం పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమె జడ్చర్ల ఆస్ప త్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సోదరుడు గులాం హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

స్కూటీ పేరుతో డబ్బు స్వాహా

- మోసం చేసిన సైబర్ నేరగాళ్లు

గద్వాల క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : స్కూటీ పేరుతో ఓ దివ్యాంగుడిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని 3వ వార్డుకు చెందిన సుదర్శన్‌కు మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తన పేరు పాతపాలెం రంగస్వామి అని, జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడిని అని చెప్పాడు. దివ్యాంగుడైన మీ బాబాయి గొల్ల గోపాల్‌కు స్కూటీ మంజూరైందని, రూ. 6,300 చెల్లిస్తే వెంటనే స్కూటీని పంపిస్తామని తెలిపారు. తాను జిల్లా కేంద్రంలోని దివ్యాంగులశాఖ కార్యాలయంలో ఉన్నానని చెప్పాడు. స్కూటీ ఫోటోలను వాట్సా‌ప్‌లో పంపించాడు. దీంతో సుదర్శన్ అతడిని నమ్మాడు. తాను ప్రస్తుతం వేరే ఊరిలో ఉన్నానని, బుధవారం వచ్చి ఇస్తానని చెప్పాడు. కానీ గుర్తు తెలియని వ్యక్తి అందుకు అంగీకరించలేదు. మీరు డబ్బు ఇవ్వకపోతే స్కూటీని వేరేవారికి కేటాయిస్తామని చెప్పాడు. దీంతో గోపాల్ అతడు ఇచ్చిన నెంబర్‌కు రూ. 6,300 ఫోన్ పే చేశాడు. ఆ తర్వాత ఆ ఫోన్లు స్విచ్ ఆఫ్ అయిపోయాయి. ఆందోళనకు గురైన గోపాల్ దివ్యాంగుల శాఖ కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా, రంగస్వామి అనే వ్యక్తి ఎవరూ లేరని చెప్పారు. మోసపోయినట్లు గ్రహించిన గోపాల్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువకుడిపై ముసుగు దొంగల దాడి

- రూ. 5 వేలు, సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లిన దుండగులు

గద్వాల క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ యువకుడిపై ముసుగులు వేసుకున్న ఇద్దరు వ్యక్తులు కర్రలతో దాడి చేశారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని రేకులపల్లి గ్రామానికి చెందిన రాకేశ్ గత ఆదివారం ద్విచక్రవాహనంపై వస్తుండగా, గాంధీచౌక్ నుంచి గంజిపేటకు వెళ్లే దారిలో ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు కర్రలతో దాడి చేశారు. దీంతో కింద పడిన రాకేశ్ జేబులో ఉన్న రూ. 5వేలతో పాటు, సెల్‌ఫోన్ తీసుకొని గంజిపేట వైపు పారిపోయారు.

కొద్దిసేపటికి తేరుకున్న బాధితుడు కిష్టారెడ్డి బంగ్లా సమీపంలో ఉన్న తమ బంధువుల ఇంటికి వెళ్లి విషయం చెప్పాడు. వారు అతడిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే కర్నూల్ ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సూచించడంతో వారు రాకేశ్ తండ్రి నాగిరెడ్డికి తెలిపారు. అనంతరం రాకేశ్‌ను కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. సంఘటనపై బాధితుడి తండ్రి నాగిరెడ్డి బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


పెద్దకొత్తపల్లి సింగిల్ విండో కార్యాలయంలో రైతులతో కలిసి నిసరన తెలుపుతున్న బీజేపీ నాయకులు


జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న రైతులు


బిజినేపల్లిలోని పీఏసీఎస్ ఎరువుల గోదాం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

యూరియా దొరుకుతలేదయా!

- సహకార సంఘాల వద్ద రైతుల బారులు
- క్యూలైన్లలో గంటల తరబడి ఎదురుచూపులు
- సరిపడా ఇవ్వకపోవడంతో ఆందోళనలు
- సంఘీభావం తెలిపిన వివిధ పార్టీల నాయకులు


ఖిల్లాగణపురం సింగిల్ విండో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఖిల్లాఘణపురం/ ఆత్మకూరు/ గద్వాల/ బిజినేపల్లి/ పెద్దకొత్తపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగుకు కీలకమైన సమయంలో యూరియా దొరకడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విసిగి, వేసారి ఆందోళన బాట పడుతున్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద బుధవారం ఉదయమే రైతులు బారులు తీరారు. పక్క మండలాల రైతులు యూరియా తీసుకుంటున్నారంటూ కొందరు అభ్యంతరం తెలిపారు. యూరియా కోసం గుంపుగా ఎగబడడంతో ఎస్‌ఐ సురేశ్ వనపర్తి నుంచి పోలీసు సిబ్బందిని పిలిపించి, పరిస్థితిని చక్కదిద్దారు.

ఆత్మకూరులోనూ అదే పరిస్థితి

ఆత్మకూరు సింగిల్‌విండో కార్యాలయానికి ఉదయం 6 గంటలకే రైతులు చేరుకున్నారు. చెప్పులు, వస్తువులను వరుసగా ఉంచి, తమ వంతు కోసం ఎదురు చూశారు. సాయంత్రం 4 గంటలకు యూరియా లారీ వచ్చింది. ఆ తర్వాత ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. తమ వంతు వచ్చే వరకు వేచి ఉండేందుకు వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడ్డారు. ఓ వృద్ధుడు అలసి పోయి క్యూలైన్లోనే పడుకోవడం కనిపించింది.

బిజినేపల్లి పీఏసీఎస్ ముందు ధర్నా

రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బిజినేపల్లి పీఏసీఎస్ గోదాం ముందు సీపీఎం ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అశోక్ మాట్లాడుతూ ఒక్కో రైతుకు రెండు సంచుల యూరియా మాత్రమే ఇవ్వడం సరికాదన్నారు. అంతే కాకుండా నానో లిక్విడ్ యూరియా కొనుగోలు చేయాలని షరతు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. ధర్నాలో సీపీఎం మండల నాయకులు చంద్రశేఖర్, సంతోష్, బాలపీరు, శ్రీనివాసులు, రాములు, వెంకటయ్య ఉన్నారు.

పెద్దకొత్తపల్లిలో నిరసన

పెద్దకొత్తపల్లి సింగిల్ విండో కార్యాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలిపారు. అనంతరం ఏవోతో పార్టీ నాయకులు మాట్లాడారు. రైతులకు అవసరమైన మేర యూరియా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, లేకపోతే సింగిల్ విండో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు పదిర భీమేష్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి బీనమోని లింగస్వామి, నాయకులు బీనమోని లింగస్వామి, మేకల శివ, బంటుపల్లి శివ పాల్గొన్నారు.

గద్వాలలో రాస్తారోకో

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పీఏసీఎస్‌లో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతు నాయుడు రైతులతో కలిసి అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో పాటు, అధికారులతో మాట్లాడారు. అందరికీ యూరియా ఇస్తామని చెప్పడంతో విరమించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కలెక్టర్ బీఎం సంతోష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్‌లతో మాట్లాడి 22 మెట్రిక్ టన్నుల యూరియాను విడుదల చేయించారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

- డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి


డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కొల్లాపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ పట్టణంలోని డీసీసీబీలో సింగిల్ విండో చైర్మన్లతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సింగిల్‌విండోల కాల పరిమితిని మరో ఆరు నెలలు గడువు పొడిగించినందుకు మాలల చైతన్య సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రామదాసు ఆధ్వర్యంలో నాయకులు, రైతులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో, మంగళవారం 64 వేల మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి అయినట్లు వెల్లడించారు. బుధవారం జడ్చర్ల రైల్వే స్టేషన్‌లో 1,800 మెట్రిక్ టన్నులు, గద్వాల స్టేషన్‌లో 2,600 మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి అయినట్లు తెలిపారు. రాష్ట్రంలో యూరియా కొరత తలెత్తకుండా ఎంపీ కృషి చేస్తున్నారని చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 105 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయని, వాటికి 60 శాతం, ప్రైవేటు డీలర్లకు 40 శాతం యూరియాను కేటాయించినట్లు చెప్పారు. సింగిల్‌విండోల్లో యూరియా ధర తక్కువగా ఉండడంతో రైతులు బారులు తీరుతున్నారని తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు 85,200 టన్నుల యూరియా రావాల్సి ఉండగా, ఇప్పటివరకు 68 వేల మెట్రిక్ టన్నుల యూరియా దిగుమతి అయినట్లు తెలిపారు. యూరియా కొరత తలెత్తకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రతీ రోజు సమీక్షిస్తున్నారని చెప్పారు. కొల్లాపూర్, కొప్పునూరు, తూంకుంట సింగిల్‌విండో చైర్మన్లు పెబ్బేటి కృష్ణయ్య, నరసింహారెడ్డి, రామన్‌గౌడ్ ఉన్నారు.

పురాతన బావుల సుందరీకరణకు కృషి

- ప్రముఖ ఆర్కిటెక్ట్ కల్పన
- మాగనూరు, కృష్ణ, మక్తల్ మండలాల్లోని కోనేర్ల పరిశీలన


మాగనూరులోని కోనేరును పరిశీలిస్తున్న ఆర్కిటెక్ట్ కల్పన, కాంగ్రెస్ నాయకులు

మాగనూరు/ కృష్ణ/ మక్తల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పురాతన బావులు, కోనేరుల సుందరీకరణకు కృషి చేస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆర్కిటెక్ కల్పన అన్నారు. నారాయణపేట జిల్లా, మాగనూరు, కృష్ణ, మక్తల్ మండల కేంద్రాల్లోని పురాతన కోనేరులను బుధవారం ఆమె సందర్శించారు. మాగనూరులోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద ఉన్న కోనేరును పరిశీలించారు. కృష్ణ మండలంలోని కున్సి, గుడెబల్లూరు, ముడుమాల్ గ్రామాల్లోని వేణుగోపాల స్వామి, లక్ష్మీ వేంకటేశ్వర స్వామి, రామలింగేశ్వర స్వామి, మక్తల్ పట్టణంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయంలోని కోనేరులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మంత్రి వాకిటి శ్రీహరి సూచన మేరకు తాను పురాతన కోనేరులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో వాటి సుందరీకరణకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఆయా ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మాగనూరు మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, మక్తల్ నాయకులు కట్ట సురేశ్, రవికుమార్, నాయకులు గణేష్‌కుమార్, రవికుమార్, కల్లూరిగోవర్ధన్, బోయ నర్సింహా, ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప, దేవేంద్రప్ప, పురోహితుడు ప్రభు పాల్గొన్నారు.

బీ ఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదల


పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్ బాబు, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ , ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ పరిధిలో బీ ఫార్మసీ 8వ సెమిస్టర్ రెగ్యులర్, 1, 3, 5, 7 సెమిస్టర్ల బ్యాక్‌లాక్ పరీక్ష ఫలితాలను బుధవారం ప్రకటించారు. యూనివర్సిటీ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లో వీసీ, ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబులతో కలిసి ఫలితాలను విడుదల చేశారు. 8వ సెమిస్టర్‌లో 82.74 శాతం ఉత్తీర్ణత సాధించారని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ తెలిపారు. విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను చూసుకోవాలని సూచించారు. అభ్యంతరాలుంటే రీవాల్యుయేషన్ చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అదనపు అధికారి డాక్టర్ శాంతిప్రియ, ప్రిన్సిపాల్ డాక్టర్ రవికాంత్, పరీక్షల కోఆర్డినేటర్స్ డాక్టర్ సురేశ్, డాక్టర్ ఈశ్వర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో పీజీ 4వ సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. పరీక్ష కేంద్రాలను బుధవారం పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ, ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, అబ్జర్వర్ డాక్టర్ నూర్జహాన్‌లతో కలిసి తనిఖీ చేశారు. 4వ సెమిస్టర్ పరీక్షలకు 1,911 మందికి గాను 1,792 మంది విద్యార్థులు హాజరయ్యారని, 64 మంది గైర్హాజరయ్యారని డాక్టర్ ప్రవీణ తెలిపారు.

మహిళల రక్షణలో భరోసా కేంద్రాలు కీలకం


మాట్లాడుతున్న న్యాయాధికారి ఇందిర

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, చిన్నపిల్లల రక్షణలో భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జిల్లా న్యాయాధికారి ఇందిర అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో భరోస కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. సమాజంలో జరిగే హింసాత్మక ఘటనల నివారణ, బాధితులకు న్యాయం అందించడంలో పోలీస్ శాఖ, లీగల్ సర్వీసెస్ అథారిటీ, మహిళా శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో ఉండాలని సూచించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి జరీనా, డీఎండీహెచ్‌వో కృష్ణ, అదనపు ఎస్పీ బీఎస్ రత్నం, ఉమెన్ సెఫ్టీ వింగ్ డీఎస్పీ శ్రీధర్, భరోసా డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

బైక్‌లో పాము

అయిజ టౌన్, అగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు పక్కన ఆపిఉన్న ద్విచక్రవాహనంలో ఓ పాము దూరింది. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలో జరిగింది. పట్టణానికి చెందిన యువకుడు రమేశ్ బుధవారం మధ్యాహ్నం అంబేద్కర్ చౌక్‌లో తన వాహనాన్ని నిలిపి పని మీద వెళ్లాడు. ఆ తర్వాత వచ్చిన అతడు బైక్‌పైకి ఎక్కి స్టార్ట్ చేస్తుండగా, సీటుకు దిగువన పాము తోక కనిపించింది. దీంతో వెంటనే కిందకు దిగిన అతడు స్థానికులతో కలిసి పామును బయటకు తీసేందుకు యత్నించాడు. సాధ్యం కాకపోవడంతో స్థానికంగా ఉన్న మెకానిక్ సాయంతో పామును బయటకు తీశారు. సైఫాన్ అనే యువకుడు ఆ పామును సమీపంలోని అడవిలో వదిలేశాడు.

పార్థీనియం మొక్కలతో పంటలకు నష్టం


పాలెం కేవీకే వ్యవసాయ క్షేత్రంలో పార్థీనియం కలుపు నివారణపై వ్యవసాయ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి

బిజినేపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పంటపొలాల్లో కనిపించే పార్థీనియం కలుపు మొక్కతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి అన్నారు. మండలంలోని పాలెంలోని కేవీకేలో బుధవారం పార్థీనియం కలుపు మొక్క నిర్మూళన, నివారణపై వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పార్థీనియం కలుపు (వయ్యారిభామ) మొక్క ప్రపంచం అంతా విస్తరించడంతో పాటు అన్ని రకాల కాలాల్లో పెరుగుతూ పంట మొక్కలకు ఆశించే తెగుళ్లకు వారధిగా మారుతుందని అన్నారు. ఈ కలుపు మొ క్కలను వేర్లతో సహా పీకి భూమిలో పాతిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ బి.రాజశేఖర్, డాక్టర్ ఒంగలు శైల తదితరులు ఉన్నారు.

పొంగి పొరలుతున్న వాగులు

- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు


వర్కూర్ – మాగనూర్ మధ్యనున్న కల్వర్టుపై వరద నీరు పారుతుండటంతో రోడ్డుకు అడ్డంగా నిలిపిన వాహనాలు

మహబూబ్‌నగర్/ నాగర్‌కర్నూల్ టౌన్/ నారాయణపేట/ నాగర్‌కర్నూల్ టౌన్/ గద్వాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వారం పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి పొరలుతున్నాయి. వరదనీరు రహదారులపై ఉధృతంగా పారుతుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని గోపన్నపల్లి గ్రామానికి వెళ్ళాలంటే వాగు దాటాల్సి ఉంటుంది. అక్కడి రోడ్ డ్యామ్‌పై వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్‌డ్యామ్ కూడా ఒక వైపు కోతకు గురయ్యింది. కౌకుంట్ల మండలం కౌకుంట్ల - ఇస్రంపల్లి గ్రామాల మధ్యనున్న వాగుపై నిర్మించిన రోడ్ బ్రిడ్జిపై భారీగా వరద పారుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడే ఉండి ఎవరినీ రోడ్‌బ్రిడ్జిపైకి వెళ్ళకుండా చూస్తున్నారు. బుధవారం వరద కాస్త తగ్గుముఖం పట్టడంతో ప్రజలు నెమ్మదిగా రాకపోకలు సాగిస్తున్నారు. అడ్డాకుల మండలం రాచాల - గుడిబండ వద్ద చెక్‌డామ్ పక్కన గైడ్‌వాల్ తెగిపోవడంతో పొలాల్లోకి వరద నీరు చేరింది.

● నారాయణపేట జిల్లా, మక్తల్ మండలం సంగబండ రెండు గేట్లు ఎత్తి వెయ్యి కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సంగబండలో 2.6 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వర్కూర్ - మాగనూర్ మధ్యనున్న కల్వర్టుపైన వరద పారుతుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొత్తపల్లి - భూనేడ్‌ల మధ్య వంతెన నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో, తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఆరు రోజులుగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొత్తపల్లి నుంచి నారాయణపేటకు, భూనేడ్ నుంచి కోస్గీకి వెళ్లే వారు చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావడంతో ఇబ్బంది పడుతున్నారు. ఊట్కూర్ మండలంలోని అవుసలోనిపల్లి - బిజ్వార్‌ల మధ్య వాగు, మల్లేపల్లి, అమీన్‌పూర్, పగిడిమర్రి గ్రామాల మధ్య వాగుల ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. బ్రిడ్జుల నిర్మాణం కోసం అధికారులు ప్రతిపాదనలను పంపించారు.

● జోగుళాంబ గద్వాల జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. మానవపాడు - అమరవాయి గ్రామాల మధ్యన పెద్ద వాగు పొంగిపొర్లడంతో ఐదు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. దాదాపు 663 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు నిర్ధారించారు. ఈ వాగు రెండుసార్లు పొంగడంతో మునిగిన పంటలు రికవరీ అయ్యే అవకాశం లేకుండా పోయింది. షేక్‌పల్లి - గార్లపాడుల మధ్య మూడు వాగులు పొంగడంతో దాదాపు 60 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో పత్తి పంటకు ఎర్రతెగులు సోకింది.

తగ్గిన వాన జోరు

మంగళవారం రాత్రి బుధవారం ఉదయం నాగర్‌కర్నూలు, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో మాత్రమే కొద్దిపాటి వర్షం కురిసింది. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో 43.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తిమ్మాజిపేటలో 28.8 మిల్లీ మీటర్లు, బిజినేపల్లిలో 22.0, అచ్చంపేటలో 19.6, లింగాలలో 18.6, కోడేరులో 16.8, ఉప్పునుంతలలో 16.2, ఉర్కొండలో 16.4, పెద్దకొత్తపల్లిలో 15.0, పదరలో 14.4, అమ్రాబాదులో 14.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. వనపర్తి జిల్లా ఘణపూర్‌లో 40.4 మి.మీ వర్షపాతం నమోదైంది. గోపాల్‌పేట 27.4, రేవల్లి 22.4, వనపర్తి 22.6, అమరచింత 21.2, పెద్దమందడి 16.8, కొత్తకోట 14.6, మదనాపూర్ 12.2, వీపనగండ్ల 10.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో 24.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరికల్ మండలంలో 23.8, దామరగిద్దలో 21.3, ధన్వాడ 19.3, నారాయణపేట 15.8, మాగనూర్ 14.3, గుండుమాల్ 12.5, కోస్గి 12.0, నర్వ, మద్దూర్ మండలాల్లో 11.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

న్యూస్ బాక్స్

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న రాజేశ్వరి, అశోక్‌బాబు

కొత్తకోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి కర్ణాటక రాష్ట్రం, రాయిచూరు పట్టణానికి చెందిన పోలిశెట్టి రాజేశ్వరి, అశోక్‌బాబు దంపతులు లక్షా వెయ్యి నూట పదహార్లు విరాళం బుధవారం అందజేశారు. విరాళం ఇచ్చిన దంపతులను ఆలయ అర్చకులు శాలువాతో సన్మానం చేశారు. నాగరాజు, కిషోర్, సత్యం సాగర్, సుధాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఉపాధ్యాయుల సన్మానం

కొత్తకోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనిమెట్ట గ్రామానికి చెందిన రమేష్‌ను ఉస్మానియా యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని మిరాసిపల్లి గ్రామ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం సన్మానం చేశారు. జీహెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయుడు రమేష్, సత్యనారాయణ, విష్ణువర్ధన్ ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెద్దమందడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నమందడి గ్రామానికి చెందిన గుండెమోనని నాగరాజు పెద్దమందడి మండల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06లో పదో తరగతి చదివాడు. రెండు నెలల కిందట అనారోగ్యంతో మృతిచెందడంతో విషయం తెలుసుకున్న తోటి మిత్రులు స్నేహితుడి కుటుంబానికి తమ వంతు సాయంగా రూ.84 వేలను అందించారు. మధు, మధుసూదన్‌రెడ్డి, మహేష్, నాగరాజు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత అవార్డు గ్రహీతకు పద్మశాలీల సన్మానం

కొత్తకోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వీవర్స్ కాలనీకి చెందిన సారంగి రాములును రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేనేత అవార్డుతో సత్కరించింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో పద్మశాలీలు రాములు ఇంటికి వెళ్లి శాలువాతో సన్మానం చేశారు. బాలనారాయణ, వెంకటేష్, బాలరాజు, సత్యనారాయణ, నాగరాజు, శ్రీనివాసులు, రాములు, వెంగళ్‌రాజు, చిన్ని శంకర్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి గాయాలు

ఆత్మకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : చిన్నచింతకుంట మండలం కురుమూర్తి గ్రామానికి చెందిన హరికృష్ణ, శివలు బైక్‌పై ఆత్మకూరు పట్టణ కేంద్రానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో పిన్నంచర్ల గ్రామ స్టేజీ వద్ద అదే గ్రామానికి చెందిన వంశీ, గోపిల బైక్‌లో పెట్రోల్ అయిపోవడంతో తోసుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో నలుగురు కలిసి రెండు ద్విచక్ర వాహనాలను ఆత్మకూరు పట్టణ కేంద్రం వైపు తోసుకుంటూ వస్తుండగా అల్లీపూర్ నుంచి ఆత్మకూరు వైపు వస్తున్న డీసీఎం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో వారికి గాయాలయ్యాయి. వారు బంధువుల సాయంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఆత్మకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : తూంపల్లి గ్రామానికి చెందిన రాజన్న(70) కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈ నెల 19న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి కింద పడిపోవడంతో పక్కనే ఉన్న బంధువులు చూసి ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నరేందర్ తెలిపా రు.

మునిసిపల్ కమిషనర్‌కు వినతి

అమరచింత, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన ఏర్పాటుకు స్థలం కావాలని బుధవారం అమరచింత మునిసిపల్ కమిషనర్ నాగరాజుకు శివాజీ విగ్రహ కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. సురేష్, మోహన్, భరత్ పాల్గొన్నారు.

ముగిసిన బోధన అభ్యసన సామగ్రి మేళా

అమరచింత, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని డీఎంఆర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి బోధన అభ్యసన సామగ్రి మేళా బుధవారం ముగిసింది. మండల స్థాయి మేళాను ఎంపీడీవో శ్రీనివాసులు, అమరచింత ఎస్ఐ స్వామి, అమరచింత, ఆత్మకూర్ ఎంఈఓలు భాస్కర్ సింగ్, బాలరాజ్‌లు ప్రారంభించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వనపర్తి వైద్యవిభాగం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మెడికల్ షాపుల యజమానుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన మెడికల్ షాప్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని మెడికల్ షాప్ అసోసియేషన్ కార్యాలయంలో లీగల్ అడ్వైజర్ బాలయ్య, చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ జైనీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా సురేష్ కుమార్, సెక్రటరీగా మద్దిలేటి, ట్రెజరర్‌గా మణికుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇళ్లలోకి చేరుతున్న నీరు

ఆత్మకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా భారీ వర్షాల కారణంగా వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతుందని ఇలాగే నూతనంగా నిర్మాణాలు చేపట్టేందుకు కూడా వీలు లేకుండా వర్షపు నీరు చేరుతుందని ఆరేపల్లి గ్రామ రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

కుంటలను తలపిస్తున్న పాఠశాలలు

- పట్టించుకోని అధికారులు, నాయకులు

పెబ్బేరు రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంచిరావుపలి, అయ్యవారిపల్లి, బునాదిపురం జిల్లా పరిషత్ పాఠశాలలు, పెబ్బేరు మోడల్ స్కూల్ ప్రభుత్వ పాఠశాలలో చిన్నపాటి వర్షాలకు పాఠశాలల ఆవరణలు చెరువులను తలపిస్తున్నాయి. విద్యార్థులు చదువుకునేందుకు, ఆటలను ఆడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలల ఆవరణలో గుంతలుగా ఉండటంతో వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోతుంది. వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు పాఠశాలల ఆవరణలు మొత్తం నీరు నిలవడంతో కనీసం తరగతి గదుల్లోకి వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు వచ్చిన ప్రతిసారి పాఠశాలల ఆవరణల్లో నీరు నిల్వ ఉండటంతో చదువులు కొనసాడం ఎలాగని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడుతే విద్యార్థులు పాఠశాలలకు రావాలా.. వద్దా అని తల్లిదండ్రులు ఉపాధ్యాయులను ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం పాఠశాలల బలోపేతం కోసం కృషి చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం పూర్తిస్థాయిలో అమలు కావడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలల ఆవరణల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.



పెబ్బేరు మోడల్ స్కూల్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



కంచిరావుపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

శ్రీరంగాపురం ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : శ్రీరంగాపూర్ పోలీస్‌స్టేషన్ వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఎస్పీ రావుల గిరిధర్ తనిఖీ చేశారు. పోలీసుల గౌరవవందనం స్వీకరించి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులను తని ఖీ చేసి పోలీస్‌స్టేషన్ రిసెప్షన్, లాకప్, టెక్నికల్ రూం పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి, పెండింగ్‌లోని కేసులు, దర్యాప్తు వివరాలను ఎస్ఐ రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో వార్డుకు పోలీస్ అధికారిని కేటాయించి వీపీవో విధానాన్ని పక్కాగా అమలు చేస్తూ.. గ్రామాలకు సంబంధించిన వీపీవోలు రోజు గ్రామాలను సందర్శించి అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో బ్లూకోర్ట్, స్టేషన్ రైటర్స్, సెక్షన్ ఇన్‌చార్జి, పెట్రో కార్ రిసెప్షన్ లాంటి వర్టికల్స్ అమలు చేయాలని సూచించారు. మండలంలో గంజాయి, మట్కా, పేకాట లాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాల్నారు. సాయంత్రం సమయంలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర రావు, కొత్తకోట ఇన్‌చార్జి సీఐ నరేష్, పెబ్బేరు ఎస్ఐ యుగంధర్‌రెడ్డి, డీసీఆర్బీ ఎస్ఐ తిరుపతిరెడ్డి, పెబ్బేరు రెండో ఎస్ఐ దివ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీకి మొక్క అందజేస్తున్న ఎస్ఐ

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

వనపర్తి : వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్పీ రావుల గిరిధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న వినాయక చవితిని పురస్కరించుకుని మండపాల నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కింద ఉన్న ఆన్‌లైన్ లింకు హెచ్‌టీటీపీఎస్: //పోలీస్ పోర్టల్. టీఎస్ పోలీస్. జీవోవి. ఇన్/ ఇన్‌డెక్స్ హెచ్‌టీఎంను క్లిక్ చేసి అందులో దరఖాస్తుదారుడి వివరాలు, విగ్రహం ఏర్పాటు చేస్తున్న ప్రదేశం, ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, విగ్రహం ఏర్పాటు చేస్తున్న మండపం ఎత్తు, కమిటీ సభ్యుల పేర్లు వారి ఫోన్ నెంబర్లు, విగ్రహం నిమజ్జనం చేసే తేదీ సమయం, ప్రదేశం, ఆప్రదేశానికి ఏ వాహనంలో చేరుకుంటారనే వివరాలు పొందుపరచాలన్నారు.

అదే విధంగా మండప నిర్వాహకులు, గణపతి కమిటీ సభ్యులు, వలంటీర్ల వివరాలు, ఫోన్ నెంబర్లు చిరునామా పూర్తిగా నమోదు చేయాలని సూచించారు.

అదే విధంగా ప్రతీ పోలీస్‌స్టేషన్ సిబ్బంది కొన్ని సూచనలు ఇస్తారని, అవి ప్రతీ ఒక్కరు పాటించాలని, లేకుం టే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజకీయాన్ని వ్యాపారంగా మార్చారు

- బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్

ఖిల్లాఘణపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు రాజకీయాన్ని వ్యాపారంగా మార్చు చేశారని బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్ తెలిపారు. బీజేపీ మండల నాయకులు శాంతికుమార్‌కు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో బుధవారం వెంకటాంపల్లికి చెందిన చిలుక పెద్ద చెన్నయ్య సాగర్ ఆధ్వర్యంలో 100 మంది బీజేపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సాయంతోనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబు గౌడ్, నారాయణ, లోక్‌నాథ్‌రెడ్డి, అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, సబిరెడ్డి వెంకట్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాంతికుమార్

బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మండల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించి బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ సుగుణకు వినతిపత్రం అందజేశారు.

పోచమ్మ అమ్మవారికి పల్లకీ సేవ

ఖిల్లాగణపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కొండపై వెలిసిన పోచమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా బుధవారం భక్తులు పోచమ్మ అమ్మవారి చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి పల్లకీ సేవ కనుల పండువగా నిర్వహించారు. పోచమ్మ ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు అమ్మవారిని అందంగా అలంకరించి, ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి, భక్తులకు సౌకర్యాలు కల్పించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మహిళలు బొడ్డెమ్మలు ఆడుతూ, భజన మండలి సభ్యులు అఖండ భజనలు చేశారు. పోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవం గురువారం నిర్వహించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అసంపూర్తి బ్రిడ్జికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

మదనాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊకచెట్టు వాగుపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పార్టీ నాయకులతో కలిసి బ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద వచ్చినప్పుడల్లా ఆత్మకూర్, వనపర్తిలకు రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో బ్రిడ్జి పనులు ప్రారంభించినా.. పనులు అసంపూర్తిగా మిగిలాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 20 నెలలు కావొస్తున్నా అసంపూర్తి పనులు చేపట్టకపోవడం విడ్డూరమని అన్నారు. మాధవరెడ్డి, బాబుగౌడ్, కృష్ణయాదవ్, అమర్‌నాథ్, వెంకటేశ్వర్లు, కురుమన్న, భాస్కర్, శివ తదితరులు పాల్గొన్నారు.



వాగు వద్ద మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ముందుచూపుతో చెక్ డ్యామ్‌ల నిర్మాణం

ఖిల్లాగణపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముందు చూపుతో చెడ్ డ్యామ్‌లు నిర్మించడంతో నేడు కురుస్తున్న వర్షాలకు అవి జలకళతో ఉన్నాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య తెలిపారు. మండలంలోని వెంకటాంపలిలో గతంలో నిర్మించిన చెక్‌డ్యామ్ వద్ద బుధవారం రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు పూలు చల్లి సంబురాలు చేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కృష్ణనాయక్ మాట్లాడుతూ.. మండలంలో మాజీ మంత్రి ని రంజన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో 12 కోట్ల 60 లక్షల ప్రభుత్వ నిధులతో 5 చెక్ డ్యామ్‌లు నిర్మించ డంతో నేడు కురుస్తున్న వర్షాలకు అవి పూర్తిగా నిండటంతో రైతులు ఆనందరం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో కాలయాపన చేస్తుందని అన్నారు. కనీసం సాగు నీటి కాల్వలను పరిశీలించే నాయకులే లేరని ఎద్దేవా చేశారు. రైతులు యూరియా కోసం ఆందోళన పడుతున్న రోజులు వచ్చాయని అన్నారు.

కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సామ్యానాయక్, సురేందర్, లక్ష్మణ్, రాజు, అంజిరెడ్డి, రాములు, సాయిలు, రైతులు పాల్గొన్నారు.



వెంకటాంపల్లి చెక్ డ్యామ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు

మార్వాడీల నకిలీ దందాలపై చర్యలు తీసుకోవాలి

కొత్తకోట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మార్వాడీలు నిర్వహిస్తున్న నకిలీ దందాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసినవారిలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్, సీపీఎం నాయకులు నిక్సన్, వికాస్, మహేష్, ప్రసాద్, ప్రణీత్, శ్రీకాంత్, మణి కుమార్, శేఖర్ ఉన్నారు.

ఉపాధిహామీపై తనిఖీలు

వీపనగండ్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 14 గ్రామ పంచాయతీలో జరిగిన ఉపాధిహామీ పథకం పనులపై 15వ విడత సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఏపీవో శేఖర్‌గౌడ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందం కోఆర్డినేటర్లతో ఎస్ఆర్పీ గంగరాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరంలో జరిగిన ఆరు కోట్ల 42 లక్షల పనులపై తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

నిజాయితీ చాటుకున్న 108 సిబ్బంది

వనపర్తి వైద్య విభాగం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : 108 వాహనంలో మంగళవారం రాత్రి రాజు అనే రోగిని జిల్లా జనరల్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించేందుకు తరలించారు. ఈ క్రమంలో బుధవారం వాహనాన్ని శుభ్రం చేస్తుండగా ఒక మొబైల్ ఫోన్ రూ.2500 నగదు దొరికాయి. అవి రోగి రాజుకు సంబంధించిన వస్తువులుగా గుర్తించి వెంటనే అతడిని సంప్రదించి వాటిని తిరిగి అందజేయగా.. పైలెట్ శ్రీనివాసులు, ఈఎంటీ బుద్ధేష్‌ను అభినందించారు.

'పట్టుదలతో శ్రమిస్తే అద్భుతాలు సాధిస్తారు'

వనపర్తి రాజీవ్ చౌరస్తా, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : యువత పట్టుదలతో శ్రమిస్తే వివిధ రంగాల్లో అద్భుతాలు సృష్టిస్తారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ పెండెం నాగన్న యాదవ్ కుమారుడు పెండెం సుధీర్ కుమార్ ఇటీవల ఇస్రో నిర్వహించిన పోటీ పరీక్షలలో సత్తాచాటి జాతీయ స్థాయిలో 51వ ర్యాంక్ సాధించి శాస్త్రవేత్తగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బుధవారం ఆయన నివాసంలో పెండెం సుధీర్ కుమార్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు.

వనపర్తి టౌన్ : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోలో ఉద్యోగం సాధించి జిల్లాకే వన్నె తీసుకొచ్చారని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ పెండ్యం నాగన్న యాదవ్ కుమారుడు సుధీర్ కుమార్ ఇస్రోలో ఆల్ ఇండియా 51వ ర్యాంకు సాధించి సైంటిస్టుగా ఎంపికైన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఆయన నివాసానికి వెళ్లి ఘనంగా సన్మానించారు.

నీట్ పీజీలో ఆల్ ఇండియా 16వ ర్యాంకు

వనపర్తి వైద్య విభాగం : వనపర్తికి చెందిన సివిల్ కాంట్రాక్టర్ వైకుంఠ రెడ్డి మనవడు రిత్విక్ రెడ్డి ఈ ఏడాది నీట్ పీజీ పరీక్షలో అఖిల భారత స్థాయిలో 684 మార్కులతో 16వ ర్యాంకు సాధించాడు.

కూలిన ఇళ్లను పరిశీలించిన జిల్లెల చిన్నారెడ్డి

పెద్దమందడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని జంగమయ్యపల్లెకి చెందిన బోయ అంజయ్య, దొడగుంటపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సాయి భార్గవి రాజశేఖర్‌శెట్టి, మోజర్ల గ్రామంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గట్టు దయాకర్‌కు చెందిన కూలిపోయిన ఇళ్లను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని, ఇల్లు కూలిన బాధితులకు ఇళ్లను ఇచ్చి ఆదుకుంటామన్నారు. నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సూచించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, రాజేంద్రప్రసాద్‌యాదవ్, రాము, బాల్‌చందర్, రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం..

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన మల్లేష్‌యాదవ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మృతుడి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం ఇచ్చారు. ఆయన వెంట యాదయ్య, రాజేంద్రప్రసాద్ యాదవ్ ఉన్నారు.



మోజర్ల గ్రామంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

ఐటీ రంగానికి పునాదులు

వనపర్తి టౌన్ : దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసిన ప్రజా నాయకుడు రాజీవ్‌గాంధీ అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జనరల్ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు.

పట్టణ కమిటీ ఆధ్వర్యంలో..

మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బండారు శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, బ్రహ్మంచారి, చీర్ల సత్యం సాగర్, రాములు పాల్గొన్నారు.

సామాజిక తత్వవేత్త నారాయణ గురు

- ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్

వనపర్తి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఒకే కులం, ఒకే మతం, ఒకే దేవుడంటూ ప్రబోధించిన నారాయణ గురు సామాజిక తత్వవేత్త అని ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో మహనీయుల స్ఫూర్తి వేదిక నాయకులు నారాయణ గురు 169వ జయంతిని నిర్వహించి మాట్లాడారు. అర్థం లేని మూఢాచారాలను నిర్మూలించడానికి, కుల వివక్ష, అంటరాని తనాన్ని రూపుమాపడానికి నారాయణ గురు 60 దేవాలయాలను కట్టించి, ఆగుడులనే బడులుగా మార్చి ఆరాధన స్థలాలు కాకుండా విద్యావ్యాప్తికి కేంద్రబిందువుగా తీర్చిదిద్దాడని కొనియాడారు. గిరిరాజాచారి, కురుమయ్య, కావలి బాలస్వామి నాయుడు, పరమేశ్వరాచారి, సత్యంచారి, ఉత్తరయ్య పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

వాల్మీకుల సమస్యలు పరిష్కరించాలి

వీపనగండ్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకుల సమస్యలు పరిష్కరించాలని వాల్మీకి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. చిన్నంబావి మండల పరిధిలోని కాలూరులో వాల్మీకుల సంఘం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు వాల్మీకులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులను శాలువాతో సన్మానం చేశారు. ఉమేష్, నరసింహ పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీలో ప్రభుత్వం విఫలం

- మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొడుగు బాలయ్య

పెబ్బేరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేయండలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొడుగు బాలయ్య ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేప పిల్లల పంపిణీకి రూ.122కోట్లు కేటాయించినా, ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు అలుగు పారుతున్నా.. చేప పిల్లలను పంపిణీ చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ కాంట్రాక్టర్‌కు అప్పజెప్పడంతో నాణ్యమైన చేప పిల్లలను అందజేయకపోవడంతో మత్స్యకారులు నష్టపోయారన్నారు.

ఘనంగా పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన

ఆత్మకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మొట్లంపల్లిలో గ్రామ దేవత పోచమ్మ అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు, భక్తులు మహిళలు యువకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాన సందర్భంగా అమ్మ వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, రేచింతల సింగిల్‌విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోటేశ్వర్, వీరేశలింగం, రామకృష్ణ హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మొట్లంపల్లి గ్రామపెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి

వనపర్తి రాజీవ్ చౌరస్తా, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కోఆర్డినేటర్ వామన కుమార్, కో కన్వీనర్ జక్కుల వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదిన హనుమకొండలో నిర్వహించనున్న బహిరంగ సభ పోస్టర్‌ను జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వామన కుమార్, వెంకటయ్య మాట్లాడారు. మధ్యభారత దేశంలో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్‌లకు కట్టబెట్టడంకోసం ఆదివాసీలను, ఆదివాసీల పక్షాన పోరాడుతున్న మావోయిస్టులను ఆపరేషన్ కగార్ పేరిట అంత మొందించేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. గోపాలకృష్ణ, జనజ్వాల, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, అనిత, జి.నాగరాజు, నరేష్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజీవ్‌గాంధీతోనే దేశం అభివృద్ధి

గోపాల్‌పేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ముందు చూపుతోనే భారతదేశం అభివృద్ధి చెందిదని ఉమ్మడి మండల ఇన్‌చార్జి సత్యశీలా రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. శివన్న వెంకటయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : పట్టణ కేంద్రంలో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి, కేక్ కటింగ్ చేశారు. పరమేష్, శ్రీనివాసులు, తులసిరాజ్ పాల్గొన్నారు.

కొత్తకోట : పట్టణ చౌరస్తాలో రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రశాంత్, చంద్రశేఖర్‌రెడ్డి, బోయోజ్, కృష్ణారెడ్డి, డాక్టర్ బాబ పాల్గొన్నారు.

ఖిల్లాగణపురం : మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గంజాయి రమేష్, నరేందర్ గౌడ్, దేవన్న, బాల్‌రెడ్డి, నాగేశ్వర్ పాల్గొన్నారు.

మదనాపురం : మండల కేంద్రంలో రాజీవ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహేష్‌కుమార్, వెంకట్‌నారాయణ, కృష్ణవర్ధన్ రెడ్డి, కృష్ణ, గోపిస్వామి, రవీందర్‌రెడ్డి, వేమన్న, సత్యశీలారెడ్డి పాల్గొన్నారు.

పెబ్బేరు : పెబ్బేరు మునిసిపాలిటీలోని సుభాష్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ జయంతిని నిర్వహించారు. శ్రీనివాస్ గౌడ్, విజయవర్ధన్ రెడ్డి, రామన్ గౌడ్, రాములు, నరసింహ, వెంకటేష్ పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొత్తకోటలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు